శంకుస్థాపన చేశారు.. ఆధునీకరణ మరిచారు!

- జిల్లా కేంద్రమైన అమలాపురంలో అందుబాటులో లేని సబ్ జైలు
- రాజమహేంద్రవరం, కొత్తపేట జైళ్లకు ఖైదీల తరలింపు
- సమయం, డబ్బు వృథా
- పోలీసులు, న్యాయవాదులు, కక్షిదారులకు ఆరేళ్లుగా అవస్థలు


అమలాపురం సబ్ జైలు ప్రాంగణంలో గుబురుగా పెరిగిన మొక్కలు, చెట్లు


నిర్వహణ లేక శిథిలమవుతున్న అమలాపురం సబ్ జైలు భవనం


ఆరేళ్ల క్రితం అమలాపురం సబ్ జైలు ఆధునీకరణ పనుల కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకం

అమలాపురం టౌన్: పాలకుల అనాలోచిత నిర్ణయాల వల్ల జిల్లా కేంద్రం అమలాపురానికి సబ్ జైలు అందుబాటులోకి రాలేదు. అమలాపురంలో ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల సముదాయంగా ఉన్న రిజిస్ట్రార్ కార్యాలయం, ట్రెజరీ, తాలూకా పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, సబ్ జైలు భవనాలను 1935లో నాటి బ్రిటీషు ప్రభుత్వం రాతి కట్టడాలతో నిర్మించింది. ఇప్పటికీ ఆ భవనాలు చెక్కు చెదరలేదు.

పటిష్టమైన ప్రహరీ తొలగింపు

అమలాపురం సబ్ జైలు ఎత్తయిన భవనం చుట్టూ దాదాపు 25 అడుగుల ఎత్తుతో ప్రహరీని పూర్తిగా రాతితో నిర్మించారు. ఈ సబ్‌జైలులో అదనపు భవనం, జైలు ఆధునీకరణ పేరుతో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.62.85 లక్షలతో ఆ పనులకు 2019 జనవరి 20న శంకుస్థాపన చేసింది. ఈ పనుల కోసం ముందుగా సబ్ జైలు చుట్టూ ఉన్న ఎత్తయిన ప్రహరీని తొలగించారు. అదనపు భవనం, ఆధునీకరణ పనులకు అదే రోజున అప్పటి డిప్యూటీ సీఎం, హోం శాఖ మంత్రి హోదాలో నిమ్మకాయల చినరాజప్ప శంకుస్థాపన చేశారు. ఈ పనులను తక్షణమే మొదలు పెట్టి ముందుగా సబ్ జైలు గోడను పునర్నిర్మించి ఉంటే అమలాపురానికి సబ్ జైలు అందుబాటులోకి వచ్చేది. ఆధునీకరణ పేరుతో జైలు ప్రహరీ గోడను తొలగించడం వల్ల రిమాండ్ ఖైదీలకు రక్షణ లేకుండా పోయింది. అప్పట్లో సబ్ జైలును తాత్కాలికంగా మూసివేశారు.

సబ్ జైలు ఊసే మరిచిన ప్రభుత్వం

ఆరేళ్ల కిందట అదనపు భవనం, ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేసిన నాటి టీడీపీ ప్రభుత్వం దాని ఊసే మరిచింది. నేడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఈ సబ్ జైలును మళ్లీ వినియోగంలోకి తీసుకురావాలన్న దిశగా చర్యలు తీసుకోవడం లేదు. కోనసీమలో పూర్వపు తాలూకా కేంద్రాలైన అమలాపురం, ముమ్మిడివరం, రాజోలు, కొత్తపేటలో సబ్ జైళ్లు ఉండేవి. ప్రస్తుతం అమలాపురం, ముమ్మిడివరం, రాజోలు సబ్ జైళ్లు పలు కారణాలతో పనిచేయడం లేదు. ఇప్పుడు కోనసీమ అంతటికీ కొత్తపేట సబ్ జైలు మాత్రమే అందుబాటులో ఉంది. సబ్ జైళ్లు లేని అమలాపురం, ముమ్మిడివరం, రాజోలు ప్రాంతాల నుంచి రిమాండ్ ఖైదీలను నేర తీవ్రత ఆధారంగా కొత్తపేట సబ్ జైలుకు లేదా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు పోలీసులు అతికష్టంగా తరలిస్తున్నారు.

దూరాభారంతో వ్యయప్రయాసలు

సబ్ జైలు అందుబాటులో లేక రిమాండ్ ఖైదీలను కొత్తపేట లేదా రాజమహేంద్రవరానికి పోలీసులు ఎస్కార్ట్‌తో పంపిస్తున్నారు. దీనివల్ల సమయం, వ్యయం కూడా వృథా అవుతోంది. ప్రభుత్వానికి కూడా ఆర్థిక భారం అవుతోంది. ఆరేళ్లుగా అటు పోలీసులు, ఇటు న్యాయవాదులు, నిందితులు కుటుంబీకులు వ్యయ ప్రయాసలతో అవస్థలు పడుతున్నారు. నిందితుడి తరఫున వాదించే న్యాయవాదులు కేసు స్టడీ కోసం నిందితుల కోసం కొత్తపేట, రాజమహేంద్రవరం జైళ్లకు వెళ్లవలసి వస్తోంది. ఇక నిందితుల తాలూకు కుటుంబీకులు అంత దూరంలో ఉన్న జైళ్లకు వెళ్లి ములాఖత్‌కు దరఖాస్తు చేసుకోవడం, తమ వారిని కలవడం గగనమవుతోంది. నిందితుల కుటుంబీకులు దాదాపు నిరక్షరాస్యులు కావడంతో అంత దూరం వెళ్లడం, ములాఖత్ కోసం అడగడం దూరాభారమే కాకుండా కొన్ని సమస్యలు కూడా ఎదురవుతున్నాయి. అమలాపురం సబ్ జైలు పరిధిలో నెలకు 20 నుంచి 30 మంది రిమాండ్ ఖైదీలు ఉంటారు. అభివృద్ధి పనులకు శంకస్థాపన చేసి మిన్నకుండడంతో బ్రిటీషు కాలంనాటి పటిష్టంగా ఉన్న సబ్ జైలు ఆరేళ్ల నుంచి నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంటోంది. సబ్ జైలు ప్రాంగణమంతా ఇప్పుడు పిచ్చి మొక్కలు, తుప్పలు, చెట్లు పెరిగి ఓ అడవిని తలపించేలా కనిపిస్తోంది.

ఇబ్బంది పడుతున్నాం

సబ్ జైలు మూత పడడం వల్ల న్యాయవాదులతో పాటు నిందితుల తాలూకు కుటుంబీకులు అనేక ఇబ్బందులకు గురవుతున్న దృష్ట్యా ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని అమలాపురం బార్ అసోసియేషన్ తరఫున ప్రభుత్వానికి వినతిపత్రం పంపించనున్నట్లు అధ్యక్షుడు చింతపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రం అమలాపురంలో ఆరేళ్లుగా సబ్ జైలు సౌకర్యం లేకపోవడం వల్ల పోలీసులు, న్యాయవాదులు, నిందితుల కుటుంబీకులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అజయ్ కుమార్ చెప్పారు. అమలాపురంలో సబ్ జైలు అందుబాటులో లేక రిమాండ్ ఖైదీలను కొత్తపేట లేదా రాజమహేంద్రవరం జైళ్లకు ఎస్కార్ట్‌తో పంపిస్తున్నామని అమలాపురం పట్టణ సీఐ పి.వీరాబాబు తెలిపారు.

క్లుప్తంగా

దాతలకు సత్కారం

అమలాపురం టౌన్: స్థానిక స్వామి వివేకానంద యోగాశ్రమం నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ అన్నదాన శిబిరం నాలుగో వార్షికోత్సవాలను స్థానిక భూపయ్య అగ్రహారంలోని యోగాశ్రమంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. యోగాశ్రమం ఆధ్వర్యంలో ప్రతి రోజూ దాతల సహకారంతో పట్టణంలోని యాచకులు, అనాథలకు అన్నదానం చేస్తున్నామని గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ తెలిపారు. ముఖ్యంగా డొక్కా సీతమ్మ అన్నదాన శిబిరానికి సహకరిస్తున్న శిష్టా భాస్కరరావు, శర్మను స్థానిక యోగాశ్రమంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యోగాశ్రమ సభ్యులతో పాటు పట్టణ ప్రముఖులు ఎం.సాగర్ వర్మ, అల్లూరి తిరుపతిరాజు, వక్కలంక సత్యనారాయణమూర్తి, ఆకొండి పవన్, తురగ చిన్న పాల్గొన్నారు.

పరదేశమ్మకు గరగ బహూకరణ


తాళ్లరేవు పరదేశమ్మవారికి గరగను బహూకరిస్తున్న కొండిశెట్టి కుటుంబ సభ్యులు

తాళ్లరేవు: గ్రామదేవత పరదేశమ్మ అమ్మవారికి ప్రముఖ కాంట్రాక్టరు కొండిశెట్టి ఈశ్వరరావు, పార్వతి దంపతులు గరగను బహూకరించారు. ఈ సందర్భంగా ఆదివారం తాళ్లరేవులో అమ్మవారి గరగలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి పరదేశమ్మ అమ్మవారి అంగన్‌గుడి వద్ద అందజేసారు. అమ్మవారి తీర్థం సందర్భంగా ఏటా అమ్మవారికి గరగను బహూకరిస్తున్నట్లు ఈశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండారు శ్రీనివాసరావు, పోతుల రాజు, గౌరీశంకర్ పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులపై నేడు సమావేశం

అమలాపురం టౌన్: జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల వసూలు అంశంపై స్థానిక జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం 3 గంటలకు జిల్లా విద్యా శాఖ విద్యార్థుల తల్లిదండ్రులకు సమావేశం ఏర్పాటు చేసినట్లు కోనసీమ వినియోగదారుల సమాఖ్య (కోకో ఫెడ్) చైర్మన్ అరిగెల బలరామమూర్తి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రైవేటు స్కూళ్లలో తల్లిదండ్రులు తమ పిల్లల చదువు కోసం చెల్లిస్తున్న ఫీజులు, పుస్తకాలు, స్కూల్ యూనిఫాం ఖర్చులు తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. ఈ సమావేశానికి తల్లిదండ్రులు విధిగా హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డీఎస్‌ఓ ఉదయభాస్కర్ సారథ్యంలో కోకో ఫెడ్ చైర్మన్ బలరామమూర్తి పర్యవేక్షణలో ఈ సమావేశం నిర్వహించనున్నారు.

ఎస్సీ సంక్షేమ అభివృద్ధి కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: ఏపీ రాష్ట్ర సంక్షేమ అభివృద్ధి కమిటీ సభ్యుడిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల జారీ చేసినట్టు ఉమ్మిడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆదివారం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ సంక్షేమ అభివృద్ధి సంక్షేమ అభివృద్ధి కమిటీ సభ్యుడిగా బాధ్యతలు అప్పగించారని ఆయన తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు సక్రమంగా అమలయ్యేలా పర్యవేక్షించి, వారి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

జీఓ 5తో ఎస్సీల సంక్షేమానికి విఘాతం

యానాం: నియోజకవర్గ పరిధిలో ఎస్సీల సంక్షేమానికి విఘాతంగా మారిన జీఓ-5 అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆది ద్రావిడ సంక్షేమ శాఖ ఎస్సీలకు సంబంధించి సంక్షేమ పథకాలు తదితర వాటి అమలుకు సంబంధించి నూతన మార్గదర్శకాలతో జీఓ-5ను విడుదల చేశారన్నారు. ఆ జీఓ అమలు చేస్తే ఎస్సీలు తీవ్ర అన్యాయానికి గురవుతారని, దీనిపై జూన్ 17న లెఫ్టినెంట్ గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. తక్షణం సంబంధిత జీఓను ఉపసంహరించుకోవాలని కోరినట్లు తెలిపారు. జీఓలో పేర్కొన్న ఇంటిస్థల వైశాల్యం నిబంధనను ఉపసంహరించుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించడం ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుత్ తీగలకు అల్లుకున్న పాదులు


పాలగుమ్మిలో విద్యుత్ తీగలపై అల్లుకున్న చెట్ల తీగలు, పాదులు, కొమ్మలు

అమలాపురం రూరల్: పాలగుమ్మిలో విద్యుత్ తీగలకు తీగలు, పాదులు పాకాయని స్థానికులు తెలిపారు. వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గాలి ఎక్కువగా ఉన్నప్పుడు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ట్రీ కటింగ్ చేపట్టి ప్రమాదాలను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉత్కంఠగా అండర్ -13 చెస్ పోటీలు


అండర్ 13- చెస్ విజేతలతో జిల్లా చెస్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక విద్యానిధి విద్యా సంస్థల ప్రాంగణంలో అండర్ -13 చెస్ పోటీలు ఆదివారం ఉత్కంఠ భరితంగా సాగాయి. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 13 ఏళ్లలోపు క్రీడాకారులైన విద్యార్థులు దాదాపు 70 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో బాలుర నుంచి ఇద్దరు, బాలికల నుంచి ఇద్దరు మొత్తం నలుగురి క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. బాలుర విభాగం నుంచి పనిశెట్టి సాయి అవినాష్ (ప్రథమ), సూరత్ వెస్లీ (ద్వితీయ), బాలికల విభాగంలో జాన్ బ్లెస్సీ (ప్రథమ), నూకపెయ్యి హన్విక (ద్వితీయ) గెలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని, వీరు ఆగష్టు 2న మచిలీపట్నంలో నిర్వహించనున్న రాష్ట్ర అండర్ -13 చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా తరఫున తలపడనున్నారని జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ తాడి వెంకటసురేష్ పేర్కొన్నారు. విజేతలకు విద్యా నిధి విద్యా సంస్థల చైర్మన్ ఆకుల బాపన్నాయుడు సర్టిఫికెట్లు, షీల్డ్‌లు, బహుమతులు ప్రదానం చేశారు. విజేతలను జిల్లా చెస్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

అగ్రి హార్టికల్చర్ సొసైటీ ద్వారా విస్తృత సేవలు


సర్టిఫికెట్లతో మహిళలు, విద్యార్థులు

యానాం: అగ్రి-హార్టికల్చర్ సొసైటీ ద్వారా రైతులకు, మహిళలకు, యువతకు ఉపాధి కల్పించే వివిధ శిక్షణా కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి, రిటైర్డ్ వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ కామిశెట్టి వేణుగోపాలరావు పేర్కొన్నారు. ఆదివారం రెండు రోజుల పాటు యానాం అగ్రి-హార్టికల్చర్ సొసైటీ ద్వారా మహిళలకు, విద్యార్థులకు, యువకులకు, రైతులకు వివిధ ఉద్యానవన పంటల ప్రాసెసింగ్ పద్ధతులు, ప్రాసెసింగ్ అండ్ వేల్యూ ఎడిషన్ టు మిల్లెట్ తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఏర్పాటుచేసిన సర్టిఫికెట్ ప్రధాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డాక్టర్ వైఎస్సార్ హార్టి కల్చర్ యూనివర్సిటీ తాడేపల్లిగూడెంకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ కరుణశ్రీ హాజరై వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. 5 ఏళ్ల క్రితం కేవలం ఏడుగురు సభ్యులతో ఏర్పాటైన సొసైటీలో పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన సభ్యులతో కలిపి ప్రస్తుతం 154 మంది ఉన్నట్టు తెలిపారు. సభ్యుల ద్వారా అనేక కార్యక్రమాలు అమలు చేయడం అభినందనీయమన్నారు. వివిధ కార్యక్రమాల అమలుకు కామిశెట్టి వెంకటమహాలక్ష్మి ఎంతగానో తోడ్పాటునందిస్తున్నారన్నారు. అనంతరం శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్లు అందజేశారు. రిటైర్ జేడీ, అగ్రి హార్టికల్చర్ సొసైటీ అధ్యక్షుడు ఎంవై హుస్సేన్‌ను పూలకిరీటంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐఏఎస్ బుద్ధి అఖిల్, కవి దాట్ల దేవదానంరాజు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఈలప్రోలు విష్ణువర్ధనరావు, మంచాల సాయికుమార్, లచ్చిపాలెం, ఎదుర్లంక, ప్రాంతాల రైతులు పాల్గొన్నారు.

సహకార సంఘం సిబ్బంది సమస్యలపై చర్చ


సమావేశంలో సొసైటీ ఉద్యోగులతో చర్చిస్తున్న పుదుచ్చేరి రిజిస్ట్రార్ ఆఫ్ సొసైటీస్ యశ్వంతయ్య

యానాం: సహకారం సంఘంలో పనిచేస్తున్న సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై ఆదివారం రాత్రి యానాంలోని ఆర్ఏఓ చాంబర్‌లో పుదుచ్చేరి రిజిస్ట్రార్ ఆఫ్ సొసైటీస్ అధికారి యశ్వంతయ్యతో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు చర్చించారు. ఈ సందర్భంగా ఇప్పటికే సిబ్బంది బకాయి వేతనాలు రూ.19లక్షలు వస్తున్నాయని వాటిని కేవలం జీతాలకు మాత్రమే ఇవ్వాలని అన్నారు. 22 రేషన్‌షాపుల ద్వారా త్వరలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. సెప్టెంబర్ నుంచి గోధుమలు పంపిణీ చేస్తారన్నారు. సొసైటీకి రెండు లిక్కర్ షాపుల లైసెన్స్‌లు మంజూరు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ యూనియన్ అధ్యక్షుడు పువ్వల శ్రీను, కొక్కిరిగడ్డ రమణ, జాఫర్, పోతురాజు పాల్గొన్నారు.

రోడ్లే పశువుల ఆవాసాలు

- ఆరంభశూరత్వంగా అధికారుల ప్రకటనలు
- హెచ్చరికలు బేఖాతరు చేస్తున్న యజమానులు


అమలాపురంలో ఓ రోడ్డుపై తిష్ట వేసిన పశువులు

అమలాపురం టౌన్: ఆవులు, ఆబోతులు, ఇతర పశువులు రోడ్లపై కనిపిస్తే.. వాటిని బంధించి గోశాలకు తరలిస్తామన్న మున్సిపల్ అధికారుల ప్రకటనలు ఆచరణలో అంతంతమాత్రంగానే ఉన్నాయి. గతంలో మాదిరిగానే అధికారులు ఇలాంటి ప్రకటనలు చేసి, కార్యక్రమాన్ని ఆరంభశూరత్వంగా మార్చేశారు. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితి యేనా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికారుల ప్రకటనలు చేసిన కొద్ది రోజులకు రోడ్లపై సంచరిస్తున్న అరడజను ఆవులను పట్టుకుని బంధించారు. తొలి తప్పుగా ఆవుల యాజమానులకు జరిమానాలు విధించి పంపించేశారు. పట్టణంలోని ప్రధాన రోడ్లపై పశువుల సంచారం మాత్రం ఏ మాత్రం తగ్గలేదు సరి కదా.. రోడ్లే వాటికి ఆవాసాలుగా మారిపోయాయి. పశువులు రోడ్లపైనే పడుకుని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతో పాటు, రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పట్టణంలో రోడ్లపై పశువులను అరికడుతున్నట్లు, రోడ్లపై సంచరించే పశువులను బంధించి గోశాలలకు తరలిస్తామని ఇటీవల మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ హెచ్చరించారు. ఈ హెచ్చరికలను రోడ్లపై విచ్చలవిడిగా సంచరించే పశువుల యజమానులు ఎంత మాత్రం ఖాతరు చేయడంలేదు. తమ పశువులను ఎప్పటిలాగే రోడ్లపై వదిలేస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఈ సమస్య పరిష్కారానికి దృష్టి పెట్టాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బూటకపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు

- మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్
- కేశనకుర్రుపాలెంలో 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' సమావేశం


ఐ.పోలవరం మండలంలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న సతీష్‌కుమార్


కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

ఐ.పోలవరం, (తాళ్లరేవు): చంద్రబాబు బూటకపు హామీలతో గద్దెనెక్కి ఇప్పుడు వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తున్నారని ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ విమర్శించారు. ఆదివారం ఐ.పోలవరం మండలం కేశనకుర్రుపాలెంలోని క్షత్రియ పరిషత్ కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు పిన్నమరాజు వెంకటపతిరాజు అధ్యక్షతన నిర్వహించారు. పార్టీ పరిశీలకుడు మాతా మురళి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పొన్నాడ మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్‌సిక్స్‌తోపాటు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారన్నారు. ఏడాది పూర్తయినప్పటికీ ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. దీంతో ఏడాదికే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో వేసిన ఉద్యోగులను తొలగించడం, నాయకులు, కార్యకర్తలపై లేనిపోని అక్రమ కేసులు పడుతున్నారన్నారు. అధికారం శాశ్వతం కాదని, భవిష్యత్తులో తగిన గుణపాఠం చెపుతామన్నారు. తప్పుడు కేసులు నమోదు చేసి ఇబ్బందిపెడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ తోపాటు ఇచ్చిన 143 హామీల మోసాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పితాని బాలకృష్ణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో నవరత్నాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమర్ధవంతంగా అమలు చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని, రాబోయే కాలంలో పార్టీ కార్యకర్తలకు పెద్దపీట వేస్తారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి నాయకులందరూ కలసి వనరులను దోచుకుంటూ ప్రజలను దారుణంగా మోసగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు ఎం.సతీష్‌రాజు, ఎంపీపీ మిరియం జ్యోతి, వైస్ ఎంపీపీ పిన్నమరాజు బాబ్జీరాజు, నాయకులు కాశి బాలమునికుమారి, ఢిల్లీ నారాయణ, జగతా బాబ్జీ, కాదా గోవిందకుమార్, నల్లా నరసింహమూర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అర్చకునికి ఘన సత్కారం


అన్నవరం దేవస్థానంలో అర్చకుడు సుబ్బారావును సత్కరిస్తున్న ఆలయ అధికారులు, పండితులు

తాళ్లరేవు: ఇంజరంలో వేంచేసియున్న ఉమాకృపేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ కందుకూరి వెంకటసూర్యసుబ్బారావును అన్నవరం దేవస్థానంలో ఘనంగా సత్కరించారు. అన్నవరం, దేవస్థానంలో వీర వెంకటసత్యనారాయణస్వామి 135వ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకుడిగా 50 ఏళ్లుగా సేవలందిస్తు సుబ్బారావును సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత కందుకూరి వెంకటసూర్య సుబ్బారావును సర్పంచ్ ముద్దన వెంకటశివరామ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు కోరుకొండ కిరణ్‌కుమారి, స్థానిక నాయకులు వేగేశ్న భాస్కరరాజు, ఆకెళ్ల సుబ్బారావు, నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు అభినందించారు.

ఆదర్శనీయుడు డాక్టర్ జంధ్యాల


ఆత్మీయ కలయికలో పాల్గొన్న ప్రముఖ వైద్యుడు సాంబమూర్తి, జంధ్యాల శిష్యులు

ముమ్మిడివరం: ప్రముఖ వైద్యుడు దివంగత జంధ్యాల చంద్రశేఖరరావు ప్రియశిష్యుల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా నిర్వహించారు. మంచితనానికి మారుపేరుగా నిలిచిన జంధ్యాల ఎంతో మంది నిరుపేదలకు ఉచితంగా వైద్య సేవలందించి ఆదర్శనీయుడిగా నిలిచారని కొనియాడారు. ఆయన 90వ జయంతి సందర్భంగా ప్రియశిష్యుల ఆత్మీయ కలయిక నిర్వహించి ఆయన సతీమణి జంధ్యాల సీతదేవిని ఘనంగా సత్కరించారు. అమలాపురానికి చెందిన ప్రముఖ వైద్యులు టీఎస్‌వీ సాంబమూర్తి, కుటుంబ సభ్యులు వైఎస్ గురుప్రసాద్, ఇందిరా ప్రియదర్శిని, జంధ్యాల సాంబశివకుమార్, లక్ష్మీ మాదవి, వారి శిష్యులు కొప్పిశెట్టి రాంబాబు, పెద్దిరెడ్డి సుబ్రహ్మణ్యం, వేముల వలస చిన్నారావు, గంగాధర్, కృష్ణారావు, అల్లవరపు ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

యానాంలో సౌత్‌సెంట్రల్ రైల్వే ఉన్నతాధికారి పర్యటన

యానాం: దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపాల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పీసీసీఎం), 1992 ఐఆర్‌టీఎస్ బ్యాచ్ అధికారి ఎస్.రమేష్ ఆదివారం యానాంలో పర్యటించారు. ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా ఆర్ఏఓ మునిస్వామిని ఆయన కార్యాలయంలో కలిశారు. అనంతరం రమేష్‌ను మునిస్వామి ఘనంగా సత్కరించారు. అనంతరం వివిధ ప్రదేశాల్లో రమేష్ పర్యటించారు. ఈ కార్యక్రమంలో డీసీఎం అలీఖాన్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, సాధనాల బాబు పాల్గొన్నారు.

కేశవరంలో వైద్య శిబిరం

కపిలేశ్వరపురం (మండపేట): కేశవరంలో ఆదివారం రాజమహేంద్రవరానికి చెందిన వేద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రైవేటు పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సర్పంచ్ పి.సత్యనారాయణమూర్తి, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ ప్రారంభించారు. వెన్నెముక వైద్య నిపుణులు తేజో ఫణీంద్ర, గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీ మృదుల సేవలందించారు.

అమ్మవార్లకు పసుపు, కుంకుమ సమర్పణ


అమ్మవార్లకు సారె సమర్పించేందుకు శోభాయాత్రగా వెళుతున్న మహిళలు

ముమ్మిడివరం: గేదిల్లంక గ్రామ దేవతలైన లంకతల్లమ్మ, లక్ష్మీదుర్గ అమ్మవార్లకు గ్రామ ఆడపడుచులు ఆదివారం పసుపు, కుంకుమ, గాజులు, స్వీట్లు, పండ్లు, చలిమిడి పానకాలు సమర్పించారు. తొలుత ఆడపడుచులు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, ఆంజనేయ స్వామి, వినాయకుడు గుడిలో పూజలు నిర్వహించి శోభాయాత్రగా గ్రామస్తులు మాతృమూర్తులతో కలసి అమ్మవారి ఆలయాలకు చేరుకున్నారు. శ్రావణ మాసం సందర్భంగా అమ్మవార్లకు కుంకుమార్చన చేశారు. సమరతా ఫౌండేషన్ ప్రచారక్ బొంతు కనకరావు, గుద్దటి వెంకట రమణమ్మ పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

ఐ పోలవరం: మండల పరిధిలో మురమళ్లలో కొలువైన వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు ఆదివారం కె గంగవరానికి చెందిన యు. శేషాద్రిబాబు రూ.10,116 విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా దాతలకు స్వామి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో దాతకు ప్రత్యేక దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమీషనర్, ఈఓ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.